ధైర్యంగా పని చేసే అవకాశం కల్పించాలి



విధి నిర్వహణలో మహిళా వైద్యులకు భద్రత కల్పించాల్సి ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాత్రిళ్లు మహిళా వైద్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీస సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలి. ఎంతో మంది మహిళలు దేవుడి మీద భారం వేసి పని చేస్తున్నారు. ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తే వైద్యులు ధైర్యంగా పని చేయగలరు. దీనివల్ల వారు మరింత నైపుణ్యవంతంగా సేవలందించగలరు.

– డాక్టర్ ఉషా ప్రసాద్, గైనిక్ ప్రొఫెసర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, విశాఖ

సరైన రక్షణ చర్యలుండాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్కోసారి నైట్ డ్యూటీలు చేయాల్సి వస్తుంది. ఆ సమయంలో సరైన రక్షణ లేకపోతే స్వేచ్ఛగా పని చేయలేం. ఒక్కోసారి పేషెంట్లతో వచ్చేవారు సరిగ్గా వ్యవహరించరు. అందుకే సరైన రక్షణ చర్యలు కల్పించాలి. ఈ విషయమై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటే మేము ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కొంత మంది పేషెంట్ల తాలూక వ్యక్తులు మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దుర్భాషలాడుతూ అవమానిస్తున్నారు. సరైన రక్షణ చర్యలుంటే ఇటువంటి వాటికి అడ్డుకట్ట పడుతుంది.

– ఎం. కమల, హెల్త్ సెక్రటరీ

పోలీసు రక్షణ ఉండాల్సిందే



వైద్యులు, వైద్య సిబ్బందికి పోలీసు రక్షణ తప్పక ఉండాలి. కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా రోగుల ప్రాణాలు దక్కవు. అటువంటి సందర్భాల్లో పేషెంట్ల బంధువులు వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులకు దిగుతున్న సందర్భాలు ఉన్నాయి. సరైన రక్షణ చర్యలుంటే అటువంటి సంఘటనలు జరగవు. అలాగే రాత్రివేళల్లో పనిచేసే మహిళా వైద్యులు, ఇతర సిబ్బందికి రక్షణ తప్పనిసరి. ఇందుకు ఆస్పత్రుల వద్ద పోలీసుల పహరా ఉండాలి. లేకపోతే నైట్ డ్యూటీలు చేయడం కష్టం.

– తంబధి, హెల్త్ సెక్రటరీ, ఎన్‌జీజీవోస్ కాలనీ

అధ్వానంగా గెడ్డలు

- దుర్గంధం నడుమే ప్రజలు
- పట్టించుకోని అధికారులు

జోన్–5 పరిధిలో పలు వార్డుల్లో గెడ్డలపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గెడ్డలు ఆక్రమణలకు గురి కావడంతో కాలువలుగా దర్శనమిస్తున్నాయి. గెడ్డలపై సర్వే జరగకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. భారీ వర్షాలకు గెడ్డల్లో ప్రవహించాల్సిన వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తూ అధికారుల నిర్లక్ష్యం బట్టబయలు అవుతోంది. గెడ్డలను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నా జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఇలాంటి పరిస్థితులు తలెత్తాయని పలువురు వాపోతున్నారు.



56వ వార్డు తోటవీధి-దుర్గానగర్‌లో కుదించుకుపోతున్న గెడ్డలు



54వ వార్డు మర్రిపాలెం మహారాణివీధి గెడ్డలో పేరుకుపోతున్న మట్టి దిబ్బలు

కంచరపాలెం : నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడానికి అధికారులు ఓ వైపు ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఇక్కడి ప్రజా ప్రతినిధులు, జోనల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ 54,55,56,57 వార్డుల పరిధి ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం పరిధిలోని మహారాణివీధి, జ్యోతినగర్, సుభాష్‌నగర్, గౌరీనగర్, శ్రీరామ్‌నగర్, తుమ్మడపాలెం, ఆశవాని పాలెం, శ్యామ్‌నగర్, భవానీ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాక ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం సమస్యలు వేధిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. ఆయా కాలనీల్లో సమస్యలతో సహవాసం చేస్తున్నామని వాపోతున్నారు.

అధ్వానంగా రహదారులు, గెడ్డలు, డ్రైనేజీలు..

ఆయా కాలనీల్లో కొన్నేళ్ల కిందట చేపట్టిన మంచినీటి పైపులైన్ పనుల నిమిత్తం రహదారి మధ్యలో గోతులు తవ్వారు. అయితే పనులు పూర్తి అయి చాలా కాలమైనా నేటికీ వాటిని పూర్తిస్థాయిలో పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో వర్షాలు పడిన సమయంలో గోతుల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వీధుల్లో రోడ్లు అలాగే ఉండడంతో పాదాచారులు జారి పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. సీసీ రోడ్లు మట్టి రోడ్లను తలపిస్తుండడంతో కాలనీ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా డ్రైనేజీలు..

వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. రహదారులకు ఆనుకుని ఉన్న కాలువలు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మురుగు సక్రమంగా ప్రవహించకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సకల రోగాలు సంక్రమించడంతో వైద్యానికి యూపీహెచ్‌సీలకు, ఆరోగ్యకేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి కనిపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. చెత్తా చెదారాలు తొలగించాల్సిన శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల శానిటరీ సెక్రటరీల పర్యవేక్షణ ఉన్నా గెడ్డలు కుదించుకుపోవడంతో వర్షాలు పడేటప్పుడు రహదారులు మురికి కూపాల్లా మారుతుండడంతో సిబ్బందికి కూడా ఇబ్బందిగా మారుతుందనే చెప్పాలి. శ్యామ్‌నగర్ నుంచి తుమ్మడపాలెం గౌరీనగర్, సుభాష్‌నగర్ వరకు గల రైల్వే ట్రాక్ రహదారి ప్రధాన గెడ్డలు, జ్యోతినగర్, సిద్ధార్థనగర్, బాపూజీనగర్, అశోక్‌నగర్, జాషువా నగర్ గెడ్డల్లో పందుల బెడద, చెత్తా చెదారాలతో దర్శనమిస్తున్నాయి. పబ్లిక్ హెల్త్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గెడ్డలను పరిరక్షించాలని, గెడ్డలపై అక్రమ నిర్మాణాలు తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



56వ వార్డు గొల్లకంచరపాలెంలో గెడ్డలను తలపిస్తున్న రహదారులు (ఫైల్)



55వ వార్డు అశోక్‌నగర్ గెడ్డ దుస్థితి ఇలా..

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు..

మా కాలనీలో సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదు. కాలనీ రహదారులను తవ్వి గోతులను నేటికీ పూడ్చలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. దీనిపై ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం పడితే రోడ్లు మురుగుతో నిండిపోతున్నాయి.

– జి. ప్రశాంతి, భవానీగార్డెన్స్, ఐటీఐ జంక్షన్

గెడ్డలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి..

జోన్ పరిధిలో పలు ప్రాంతాల్లో గెడ్డలు కుదించుకుపోవడంతో వర్షాలు పడినప్పుడు మురుగు రోడ్లపై తాండవం చేస్తోంది. గెడ్డలపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. గెడ్డలపై సర్వే చేసి అక్రమ నిర్మాణాలను తొలగిస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– జి. అజయ్, సుభాష్‌నగర్, ఊర్వశి జంక్షన్

అధికారులు దృష్టి సారించాలి..

మా కాలనీ సమస్యలపై జోన్–5 కమిషనర్, ఇతర అధికారులు దృష్టి సారించాలి. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై స్పందించాలి. వార్డులో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి సమస్యలకు పరిష్కారం చూపాలి. మౌలిక సదుపాయాలైన రహదారులు, డ్రైనేజీలు, గెడ్డలు, విద్యుత్ లైట్లపై దృష్టి సారించాలి.

– గణేష్‌కుమార్, అశోక్‌నగర్, కంచరపాలెం.

క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల సేవ నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



అవగాహన సదస్సులో సంస్థ సభ్యులు

కంచరపాలెం : ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగులకు పని ఒత్తిడి అధికంగా ఉంటుందని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి రామేశ్వరి అన్నారు. విశాఖ ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రక్షాబంధన్ వేడుకలు, రాజయోగ ధ్యానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సంస్థ సభ్యులకు ముందుగా రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా బి.కె. రామేశ్వరి మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీక అన్నారు. ఉద్యోగులు మానసిక, శారీరక ఒత్తిళ్లకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో రాజయోగ ధ్యానం ద్వారా ఒత్తిడి నివారించవచ్చన్నారు. ఉద్యోగులకు తమ కేంద్రం ద్వారా రాజయోగ ధ్యానంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గిరి, అప్పారావు, భవానీ, సునీత, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దారి దోపిడీ ముఠా సభ్యులు

మర్రిపాలెం : ఈ నెల 21వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో కాన్వెంట్ జంక్షన్ వద్ద దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు కంచరపాలెం క్రైమ్ సీఐ నిమ్మకాయల శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మురళీనగర్ ప్రాంతానికి చెందిన బోర్ల మధు (22) జ్ఞానాపురం వద్ద అంతిమయాత్ర వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం రాత్రి 8 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు కాన్వెంట్ జంక్షన్ వద్ద వేచి ఉన్నారు. ఈ క్రమంలో అటుగా హోండా యాక్టివాపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అతన్ని అటకాయించి అతని వద్ద ఉన్న రెండు వందల నగదు, మొబైల్ ఫోన్ అపహరించి ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బృందంగా ఏర్పడి ముగ్గురిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అందులో మధురవాడ ప్రాంతానికి చెందిన గరుగుబిల్లి చైతన్య, శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంగు భాస్కర్రావులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించారు. మరో నిందితుడు గోపి పరారీలో ఉండడంతో అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

డంపర్ బిన్‌తో దుర్గంధం



ఆర్పీపేట ఉన్నత పాఠశాల ప్రధాన గేటు వద్ద అడ్డంగా ఉన్న డంపర్ బిన్

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల ప్రధాన గేటు వద్ద జీవీఎంసీ పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన డంపర్ బిన్ ఏర్పాటు చేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. ప్రధాన గేటు ద్వారా కంచరపాలెం, ఆర్పీపేట ప్రాథమిక, రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ గేటునే వినియోగిస్తుంటారు. గేటుకు ఇరువైపుల చిరుతిళ్ల దుకాణాలు ఉండడంతో విద్యార్థులు అక్కడ దుకాణాల్లో మిఠాయిలు కొనుగోలు చేస్తుంటారు. డంపర్ బిన్‌లో చెత్తచెదారాలు నిండి రోడ్డుపై పడడంతో పశువుల సంచారం ఎక్కువగా ఉంది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. డంపర్ బిన్ తొలగించమని శానిటరీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థులు సీజనల్ రోగాల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్–5 పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించి డంపర్ బిన్‌ను తొలగించాలని కోరుతున్నారు.

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి నిందితులు



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డ యువకులతో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా శుక్రవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాలక్కడ్, కేరళకు చెందిన రాజేష్, అశ్విన్ అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా తిరువూరు, కేరళకు తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుండి సుమారు రూ. 65 వేల విలువైన 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న సీతారాం

విశాఖ విద్య : జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనలను అనుసరించి పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. శుక్రవారం ఆరిలోవ సెయింట్ ఆన్స్ పాఠశాలలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖల సమన్వయంతో 'బాలల హక్కుల పరిరక్షణలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, వార్డు సచివాలయం కార్యదర్శులు పాత్ర'పై అవగాహన సదస్సు నిర్వహించారు. చినగదిలి మండల విద్యాశాఖాధికారి ఎం.రవీంద్ర అధ్యక్షత వహించగా జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖ సమన్వయంతో పనిచేసి విద్యార్థినుల భద్రతకు కృషి చేయాలన్నారు. బాలలపై లైంగిక దాడులు, మంచి, చెడు స్పర్శలు, ఆడపిల్లల రుతు స్రావ సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు, బాలల హక్కులు, మాదక ద్రవ్యాల నియంత్రణ వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. వీటిపై విద్యార్థులు స్వేచ్ఛగా తమ ఇబ్బందులను తెలియజేసేందుకు ప్రతీ పాఠశాల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ సైకాలజిస్టులు పార్వతి కాశ్యప్, గాయత్రి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు.. పిల్లలకు మేలుకలిగే ఎన్నో విషయాలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ద్వారా చేరవేసేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర ట్రెజరర్ ఎం.వి.రావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు లక్ష్మి, సర్వశిక్షా అభియాన్ పీడీ బి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి–2 అనురాధ, అర్బన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పీడీ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది బి.శకుంతల,ఆనంద్, శారద, కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుమతి పాల్గొన్నారు.

యూనియన్ కార్యాలయం ప్రారంభం



రైల్వే శ్రామిక్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రమోద్ కుమార్ పట్నహాని

తాటిచెట్లపాలెం : దొండపర్తిలో గల ఆధునికీకరించిన ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ కార్యాలయాన్ని శుక్రవారం రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్ పట్నహాని ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజనల్ కో ఆర్డినేటర్ పి. రామ్మోహనరావు, జోనల్ అధ్యక్షుడు పి.వి.జె. రాజు, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జోనల్‌సెక్రటరీ బి. దామోదరరావు, యూనియన్ నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

శాకంబరి అవతారంలో పార్వతీదేవి



శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న పార్వతీదేవి అమ్మవారు

సీతమ్మధార : శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా సీతంపేటలోని శ్రీ పార్వతీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేంచేసిన పార్వతీదేవి శాకంబరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమతో భక్తులు పూజలు చేశారు.

బడ్డీ తొలగించాలని నిరసన



జోన్-3 కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న తోపుడుబళ్ల సంఘం నాయకులు

సీతమ్మధార : చినవాల్తేరు కొటక్ స్కూల్ తోపుడు బండ్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన కొత్త బడ్డీని వెంటనే తొలిగించాలని తోపుడు బళ్ల సంఘం ఆధ్వర్యంలో ఆశీలమెట్ట దరి జీవీఎంసీ జోన్-3 కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 15 సంవత్సారలుగా ఈ సెంటర్‌లో తోపుడు బళ్ల వ్యాపారం చేసుకుంటూ 23 కుటుంబాల వారు జీవిస్తున్నారని అన్నారు. ఆగస్టు 15వ తేదీన కొత్తగా ఈ సెంటర్లో బడ్డీ ఏర్పాటు చేశారని, దానిని వెంటనే తొలిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.వెంకటరావు, ఎ.అప్పారావు, కె.కుమారి పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న అధికారులు సుబ్బిరెడ్డి, శాంతి



ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె. శాంతి (టెక్నికల్) తెలిపారు. సుమారు 8 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 480 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 204 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 102 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఎంపికై న అభ్యర్థులు 26వ తేదీ సోమవారం ఆయా కంపెనీలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, ఎం.కె. మనోరమ, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



ఎన్నికల్లో విజయం సాధించిన డెలిగేట్లతో శ్రామిక్ యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం : రైల్వే కార్మిక సమస్యలపై, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నిరంతర పోరాటం చేస్తుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె. పట్నహాని తెలిపారు. ఇటీవల జరిగిన రైల్వే కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో డివిజనల్ కో ఆర్డినేటర్ పి. రామమోహనరావు నాయకత్వంలో ఘన విజయం సాధించిన యూనియన్ మద్దతుదారులతో శుక్రవారం సాయంత్రం దొండపర్తిలో గల యూనియన్ కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్నహాని ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అభ్యర్థులను, బ్రాంచ్ కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఇదే ఉత్సాహంతో పని చేసి శ్రామిక్ యూనియన్ డైరెక్టర్లను కూడా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. డివిజనల్ కో ఆర్డినేటర్ రామమోహనరావు మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఎల్లప్పుడు పోరాటాలు చేస్తున్నందున యూనియన్ మద్దతుదారులను గెలిపించారన్నారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు పి.వి.జె. రాజు, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జోనల్ సెక్రటరీ బి. దామోదరరావు, కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, అర్బన్ బ్యాంక్ డెలిగేట్ అభ్యర్థులు, యూనియన్ కేడర్ పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో జాగరూకత అవసరం

విశాఖ సిటీ: డిజిటల్ యుగంలో ఉద్యోగులు జాగరూకత, అవగాహన, భద్రతను పాటించడం అవసరమని విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పోర్ట్ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో సైబర్ సెక్యూరిటీపై అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ చైర్మన్‌తో పాటు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎల్.ఎల్.స్వామి పాల్గొన్నారు.